క్లుప్తంగా

వైభవంగా రథోత్సవం



రథంలో కొలువుదీరిన స్వామివారు

గూడూరు: స్థానిక కటకరాజవీధిలో ఉన్న రుక్మాభాయి పాండురంగ విఠలనాథస్వామి కల్యాణ రథోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజల అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గూడూరు అభివృద్ధికి కృషి చేస్తా

గూడూరు: ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలందరి సహాయ సహకారాలతో పట్టణాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య సమస్య ఉన్నట్లు తెలిసిందని, సమస్య పరిష్కారానికి తన వంతు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

నాయుడుపేటటౌన్: ముస్లింలు వారి మత గురువుల త్యాగాలను స్మరించుకుంటూ గురువారం నిర్వహించనున్న బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆకాంక్షించారు. ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే బక్రీద్ పండుగను పురస్కరించుకుని హజ్ యాత్రకు వెళ్లిన అనేక మంది ముస్లింలు వారియాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకుని రావాలని అన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన సద్గురురెడ్డి(ఫైల్)

సైదాపురం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. చీకవోలు గ్రామానికి చెందిన సద్గురురెడ్డి, రాపూరు శ్రీనివాసులు మంగళవారం సొంత పని నిమిత్తం మనుబోలు వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా గూడూరు సమీపంలోని హైవే దాటుతుండగా బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో రాపూరు శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సద్గురురెడ్డిని నెల్లూరులోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సద్గురురెడ్డి మృతి చెందారని సైదాపురం పోలీసులకు వైద్యులు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఆస్పత్రికి చేరుకుని కేసును నమోదు చేసి, శవపరీక్షల అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కూలీల సంఖ్య పెంచండి

చిల్లకూరు: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. ఉపాధి కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య తగ్గిపోతుందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ గుర్తించారని, దీన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకుని, తమ దగ్గర జాబ్ కార్డులున్న ప్రతి కుటుంబానికీ పని కల్పించేలా ప్రణాళికలను సిద్ధం చేసి, కూలీల సంఖ్య పెంచాలని అన్నారు. అలాగే పనులు జరిగే ప్రాంతంలో కూలీలకు నీడ, నీరు తదితర వసతులు కల్పించాలన్నారు. ఏపీఓ గిరిబాబు పాల్గొన్నారు.

కండలేరులో 22,931 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 22.931 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2 వేలు క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 120 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన ప్రతి చిన్నారికీ మంచి పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ నిర్మలాదేవి సూచించారు. మండలంలోని ఉడతావారిపాళెంలో జరుగుతున్న జగనన్న సురక్ష పథకంలో భాగంగా సర్వేని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం చిన్నారులకు పెట్టే భోజనాన్ని రుచి చూసి, ఇంకా మెరుగ్గా చేయాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారం నేరుగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకే చేర్చాలని తెలిపారు. కొంత మంది తమ పిల్లలకు ఇవ్వాల్సిన కోడిగుడ్లను ఇంటికి తీసుకెళతామని చెబుతారని, అలాంటి వారికి గుడ్లు ఇవ్వకుండా పిల్లలు ఇక్కడే తినేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాణిక్యం, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్, రాజా తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పంపిణీకే సురక్ష



గూడూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ వంద శాతం అందజేయాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. సొసైటీ కాలనీలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే చిల్లకూరు ఎంపీడీఓతోపాటు కార్యాలయ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనందరి ప్రభుత్వ హయాంలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు అందజేసిన పథకాలు కొన్ని సాంకేతిక కారణాలతో పాటు ఇతర కారణాలతో ఎవరికైనా అందకపోతే, వారికి అందజేయాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

ఓజిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేయాలని మండల టాస్క్‌ఫోర్స్ అధికారి రవికుమార్ అన్నారు. చిలమానుచేను సచివాలయం పరిధిలోని పెదపరియ, భువనగిరిపాళెం, చిలమానుచేను గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతిఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై బుధవారం ఆరా తీశారు. సచివాలయాల్లో ఉచిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, వీఆర్వో కస్తూరయ్య, కార్యదర్శులు పెద్దమస్తానయ్య, శ్రీకాంత్, శ్రావణి, వీఆర్‌ఏ శంకరయ్య పాల్గొన్నారు.

వలంటీర్లతో సమావేశం

ఓజిలి మండలంలోని అత్తివరం, కర్రబల్లవోలు, గ్రద్దగుంట సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులతో జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా బుధవారం సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా తెలుసుకుని అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు సురేష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కార్యదర్శి రేణుక, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, రామయ్య, ఎంఎల్ఓ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను పక్కాగా నిర్వహించాలి

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ముండలంలోని దేవరవేమూరు, చాగణం గ్రామాల్లో జగనన్న సురక్ష పథకంపై సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందశాతం మంది పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు, ఇతర ప్రభుత్వ సేవలను గుర్తించి ఉచితంగా అందజేస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జగనన్న సురక్ష అమలుపై శిక్షణ

దొరవారిసత్రం: ఏకొల్లు సచివాలయంలో బుధవారం స్థానిక ఎంపీడీఓ సింగయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పథకంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందించాలన్నారు. గురువారం నుంచి ప్రతి ఇంటికీ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. కుటుంబంలోని వారికి సర్టిఫికెట్లు, అందాల్సిన పథకాలను గుర్తించి అందించేలా కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



ఓజిలి: భువనగిరిపాళెంలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



దొరవారిసత్రం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సింగయ్య



సైదాపురం: జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్

మన ప్రభుత్వం పేదల పక్షం



పెళ్లకూరు: వడ్డిపాళెంలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

పెళ్లకూరు: మన ప్రభుత్వం పేదల పక్షమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బుధవారం చిల్లకూరు, వడ్డిపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డీడీబీ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పీ హరిబాబురెడ్డి, ఎంపీపీ పీ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎస్ ప్రిస్కిల్లా, ఎంపీటీసీ సభ్యుడు కుమారస్వామి, నాయకులు డాక్టర్ మహేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జయరామయ్య, రఘునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట నియోజవర్గ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. బిరదవాడ వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయలతోపాటు జగనన్ననగర్‌కు నీటి సరఫరా చేసేందుకు సుమారు రూ.5 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంప్ కమ్ పంపుహౌస్ నిర్మాణానికి ఎమ్మెల్యే సంజీవయ్య అధికారులు, నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైఎస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే వెంకట రమణారెడ్డి, నాయకులు కే రాజారెడ్డి, కే మాధవ రెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ ఎస్ మమత, సీ కుమార్,, పీ చంద్రారెడ్డి, భరణి రఘు, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటి పథకానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

నాయుడుపేటను మోడల్ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని మోహన్‌బాబుతోట వద్ద నూతనంగా రూ.55 లక్షలతో వేస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే సంజీవయ్య మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక, నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం ఈ-ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు. ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ విజయశేఖర్ రెడ్డి, బీ మల్లికార్జునరెడ్డి, కే జయరామయ్య, వీ మునుస్వామి నాయుడు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యసేవలు అవసరం

తడ: పారిశ్రామికవాడకు ఆధునిక వైద్య సేవలు అందించే ఆస్పత్రులు అవసరమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆంధ్ర, తెలంగాణలో ఉత్తమ సేవలు అందిస్తున్న మెడికోవర్ ఆస్పత్రి తడలో ఏర్పాటు చేసిన శాఖను కిలివేటి బుధవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కే రఘురెడ్డి, సర్పంచ్ కే ఆర్ముగం, డీసీఎంఎస్ డైరెక్టర్ జీ సురేష్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

గూడూరు: అధిక ఫీజులు వసూళ్లకు పాల్పడమే కాకుండా, పుస్తకాలు, యూనిఫామ్ అధిక ధరలకు విక్రయిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. అధిక ఫీజుల విషయమై స్థానిక విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నా, చైతన్య, జైకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ పరామర్శ



కళత్తూరు శేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

సూళ్లూరుపేట: వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డిని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ బుధవారం పరామర్శించారు. ఇటీవల నిర్వహించిన చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల్లో చిన్నపాటి అపశృతి చోటుచేసుకుని శేఖర్‌రెడ్డి కింద పడడంతో కాలు విరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ సూళ్లూరుపేటలోని శేఖర్‌రెడ్డి ఇంటికి విచ్చేసి, ఆయన్ని పరామర్శించారు. తొందరగా కోలుకోవాలన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

రాపూరు: మండలంలో బుధవారం ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్) సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆ ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిలర్ హజరత్తయ్య తెలిపారు. మండలంలో రెండు గ్రూపులుగా అన్ని పాఠశాలల్లోని 108 మంది ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీటీఎఫ్ ముందు ఉంటాదన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు రియాజ్, ప్రధాన కార్యదర్శి అక్రం, నాయకులు తులసిరామ్‌సింగ్, నాగేంద్ర, సతీష్, గుప్త, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలీలను గుర్తించాలి

వెంకటగిరిరూరల్:ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అర్హులైన కూలీలందరినీ గుర్తించి, పని కల్పించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల సమయాల్లో మస్టర్లలో వివరాలు పక్కాగా నమోదు చేసుకోవాలన్నారు. అర్హులకు జాబ్‌కార్డులను మంజూరు చేయించి, వంద రోజులు పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తనుజారెడ్డి, ఏపీఓ దీప పాల్గొన్నారు.

ముస్తాబైన మసీదులు

నాయుడుపేటటౌన్: బక్రీద్ పండుగను నిర్వహించుకునేందుకు ముస్లింలు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా మసీదులను ముస్తాబు చేశారు. పండుగ సందర్భంగా పట్టణంలోని పలు మసీదుల్లో ఈదుల్ జుహా నమాజును సామూహికంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని జామీయ (పెద్ద మసీదు)మసీదు వద్ద ఈద్గా మైదానంలో ఉదయం 9 గంటలకు, పెద్ద దర్గా వద్ద ఉన్న అమీర్‌షావలీ మసీదు, పాత బస్టాండ్ సమీపంలోని నూర్ మసీదులతోపాటు ఎల్ఏ సాగరం, పాత, కొత్త బీడీకాలనీలో ఈదుల్ జుహా నమాజును గురువారం ఉదయం ఉదయం 8 గంటలకు జరపనున్నట్లు ఆయా మసీదుల నిర్వాహకులు తెలిపారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని పలువురు కుర్బానీ ఇస్తారని, అందువల్ల ముందస్తుగా సామూహిక నమాజు నిర్వహిస్తున్నట్లు ముతవల్లీలు తెలిపారు.

వరుస మోటార్ల చోరీతో రైతుల ఆందోళన

చిల్లకూరు: వరుసగా విద్యుత్ మోటార్ల చోరీలతో తీరప్రాంత గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వరగలి, మోమిడి, తూర్పుకనుపూరు, వేళ్లపాళెం, చింతవరం గ్రామాల్లో ఇటీవల రోజు మార్చి రోజు వ్యవసాయ విద్యుత్ మోటార్లు చోరీకి గురవుతున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఇలా వరుస చోరీలకు పాల్పడుతుండడంతో ఏమి చేయాలో పాలుపోక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కొక్క విద్యుత్ మోటార్ రూ.20 వేల నుంచి రూ.40వేల వరకు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తుందని కర్షకులు వాపోతున్నారు. ఏడాదికి రెండు మూడుసార్లు మోటార్లు చోరీకి గురవుతుండడంతో అప్పుల ఊబిలో కూరుకు పోయి ఇక్కట్లు పడుతున్నామని కర్షకులు వాపోతున్నారు. పంట సాగు ద్వారా వస్తున్న ఆదాయం కంటే మోటార్ల కొనుగోలుకే అధికంగా వెచ్చించాల్సి వస్తోందన్నారు. రైతులు ఇప్పటికే పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన చోరీకి పాల్పడుతున్న వారిపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, దీంతోనే వరుస మోటార్ల చోరీలు జరుగుతున్నాయన్నారు.

నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ ధనలక్ష్మి

నాయుడుపేటటౌన్: మండలంలో అన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ధనలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెల రోజులు పాటు చేపట్టే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వార వైద్యసేవలు పొందాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు అదనంగా పొదుపు రుణం రూ.30 వేలు అందించేలా వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు కే జ్యోతిరెడ్డి, పీఆర్ డీఈ రమణయ్య, ఎంపీడీఓ శివప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాల పథకాలు దేశానికే ఆదర్శం



కలువాయి: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 4వ వార్డు కుమ్మరిగుంటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రజలు పొందిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్‌లను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎన్ సురేష్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ డీ శారద, జేసీఎస్ కన్వీనర్ పీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే అజెండాగా పథకాలు

కలువాయి: పేదల సంక్షేమమే అజెండాగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం తెలుగురాయపురం సచివాలయం పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబాన్ని కలిసి వారికి అందిన పథకాలను వివరించడమే కాకుండా వారి సమస్యలను కూడా తెలుసుకుని పరిష్కరించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్యఉద్దేశం అన్నారు. ప్రతి ఇంటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వెలుగులు కనిపిస్తున్నాయని, ప్రజల్లో ఆ సంతోషం, సంతృప్తి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు వీ ప్రభావతమ్మ, సర్పంచ్ వీ రమణమ్మ, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



వెంకటగిరి: సంక్షేమ పథకాల లబ్ధిని గురించి ప్రజలకు వివరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న సుధాభారతి

సైదాపురం: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు రిజిస్ట్రార్ సుధాభారతి తెలిపారు. సైదాపురం పీఏసీఎస్ కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం రుణాలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యం దళారుల పాలు కాకుండా ఉండేందుకు ప్రతి మండల కేంద్రంలో సహకారం బ్యాంకు ఆధ్వర్యంలో గొడౌన్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మొదటి విడతగా నెల్లూరు జిల్లాకు 45 గోడౌన్లు మంజూరు అయ్యాయన్నారు. వాటి నిర్మాణాలు కూడా పూర్తి అయ్యాయన్నారు. అలాగే రెండో విడత రెండు భవనాలు మంజూరు కాగా మూడో విడత 125 గొడౌన్లు మంజూరు అయ్యాయన్నారు. నాబార్డు నిధులతో చేపట్టనున్న గోడౌన్లు నిర్మాణ పనులు టెండర్ల దశలో ఉన్నాయన్నారు. త్వరలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు ప్రారంభిస్తామన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణం మంజూరు చేస్తున్నామని చెప్పారు. రైతులు తీసుకున్న రుణాలను తిరిగి సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం సైదాపురం సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఆమె వెంట ఎస్‌డీఐసీఓ రవికుమార్, ఆడిటర్ సుబ్రమణ్యం, పీఏసీఎస్ అధ్యక్షుడు జీ శివకుమార్, సీఈఓ బీ శ్రీను తదితరులు ఉన్నారు.

లైసెన్స్‌లు తప్పనిసరి



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

వెంకటగిరిరూరల్: ఎరువుల దుకాణ యజమానులు ఎరువుల విక్రయించే సమయంలో లైసెన్సులతో పాటు పీసీలు తప్పనిసరిగా ఉంచుకోవాలని ఏడీఏ నాగార్జున సాగర్ తెలిపారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎరువుల డీలర్లు రికార్డులు, లైసెన్సులు తప్పనిసరిగా ఉంచుకుని వ్యాపారాలు చేయాలన్నారు. అంతేగాకుండా జీరో అప్లికేషన్ ఎరువులకు లైసెన్సులు పొందుపరచాలని సూచించారు. లేకుంటే ఆయా దుకాణాలపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుజాత, ఏఈఓ గోపి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): రోడ్డు ప్రమాదానికి గురై తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బాలాయపల్లి పోలీసుల కథనం మేరకు.. గూడూరు మండలం స్వర్ణభారతినగర్‌కు చెందిన వెంకట శ్రీధర్‌కుమార్, కుటుంబ సభ్యులతో కలసి సోమవారం తన కారులో తిరుమలకు వెళ్లారు. దైవదర్శనం అనంతరం మంగళవారం రాత్రి తిరిగి గూడూరుకు వస్తున్నారు. ఈ క్రమంలో బాలాయపల్లి మండలం అంబలపూడి గ్రామం వద్దకు వచ్చేసరికే కారు అదుపుతప్పి వ్యవసాయ పొలాల్లో దూసుకెళ్లింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న శ్రీధర్‌కుమార్ తండ్రి ఆర్ వెంకటేశ్వర్లు(80) రెండు కాళ్లు విరగ్గా, భార్య శోభ, కుమార్తె శ్రీలేఖకు స్వల్పగాయాలయ్యాయి. కుమారుడు శ్రీకర్‌కు కాలు విరిగింది. గమనించిన స్థానికులు బాధితులను చికిత్స నిమిత్తం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ వెంకటేశ్వర్లు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సైదాపురంలో రెండు రహదారులకు మోక్షం



విస్తరించనున్న సైదాపురం రోడ్డు

సైదాపురం: మండలంలోని రెండు రహదారులకు మోక్షం లభించింది. కనివిని ఎరుగని రీతిలో సైదాపురం-పొదలకూరు-నెల్లూరు రోడ్డుకు రూ.45 కోట్లు, గూడూరు-తురిమెర్ల రోడ్డుకు రూ.30 కోట్లు కలిపి మొత్తంగా రూ.75 కోట్లు నిధులను విడుదల చేసింది. ఈ రహదారుల అభివృద్ధి పనులను ఆర్ అండ్‌బీ శాఖ చేపడుతుంది. వీటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కూడా మరో ముందడుగు వేసి పనులను వెంటనే ప్రారంభించే దిశగా అడుగులు వేస్తోంది.సైదాపురం -డేగపూడి వరకు సుమారు 18 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.45 కోట్లు నిధులను విడుదల చేసింది. ఈ మార్గంలోని ఊటుకూరు సమీపంలోని మావిలేరు, తురిమెర్ల వద్ద ఉన్న పిన్నేరు వాగులపై వంతెనలతో పాటు మరో 8 చిన్న వంతెనలను నిర్మించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులకు అనుమతులు కూడా మంజూరు చేసింది. సైదాపురంలో సీసీ రోడ్డు వేయనున్నారు. ఈ రోడ్డు నిర్మిస్తే దాడిశెట్టిపల్లె, పొక్కందల, ఆదూరుపల్లె, జోగిపల్లె, పెరుమాళ్లపాడు, తురిమెర్ల, గిద్దలూరు, పరసారెడ్డిపల్లె, కట్టుబడిపల్లె, దేవరవేమూరు, ఓరుపల్లె, మలిచేడు, తుమ్మలతలుపూరు, చేర్లోపల్లె, కలిచేడు, సైదాపురం, గోకుల బృందావనం గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. అలాగే సైదాపురం మండలంలోని తురిమెర్ల నుంచి గూడూరు వరకు ఉన్న రహదారి కూడా రూ.30 కోట్లుతో అభివృద్ధి చేయనున్నారు. ఈ రహదారి పనులకు కూడా టెండర్లు ఖరారయ్యాయి. ఈ రెండు రోడ్లకు సంబంధించి ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులు విడుదల చేసి, వ్యయం చేస్తోంది. ఫలితంగా ఈ రహదారులు విస్తరణ జరిగి ప్రయాణం సులువు కానుందని ఆ మార్గంలోని వారు చెబుతున్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

రాపూరు: మండల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. అన్వేష్, దావూద్ జ్ఞాపకార్థం వారి మిత్రులు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించినట్లు నిర్వాహకులు మోహసిన్, గుండు భాస్కర్, ఏటూరు సాయి, అఫ్రీది తెలిపారు. ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బిగ్‌బ్యాష్ లెవన్స్ రాపూరు జట్టుకు రూ. 22,116, ద్వితీయ స్థానం దక్కించుకున్న డీకే లెవన్స్ వంగిలి జట్టుకు రూ.12,116 నగదు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.